తాను వేసే
మూడు ప్రశ్నలకు
సమాధానాలు చెప్పగలిగే
రాకుమారుడు
ఆమెకు దొరికాడా?

బొమ్మిడి
అచ్చారావు
కథ

# మూడు ప్రశ్నలు

కళ్యాణవర్మ మద్ర దేశాధినేత. ఆయనకు లేక లేక కాంచనరేఖ అనే కుమార్తె కలిగింది. చాలా కాలానికి జన్మించిన కారణంగా ఆమెను రాజు, రాణి చాలా గారాబంగా ప్రేమగా పెంచారు.

కాంచనరేఖకు విద్యాబుద్ధులతో బాటు, కత్తియుద్ధం, గుర్రపుస్వారి మొదలైన వీరోచిత విద్యలు కూడా చెప్పించాడు కళ్యాణవర్మ. కొడుకుల్లేని కారణంగా కాంచనరేఖనే కొడుకుగా ఎంచి అన్ని విద్యలు గరిపాడు మహారాజు.

కాంచనరేఖ విద్యల్లో ఆరితేరింది. యుక్తవయస్సు రాలయింది. కళ్యాణవర్మ స్వయంవరం ప్రకటిస్తానంటే కాంచనరేఖ వద్దని వారించింది.

"అదేమిటమ్మ, స్వయంవరంలో వరుణ్ణి వరించటం అనాదిగా వస్తున్న ఆచారం. ఈనాడు దాన్ని మార్చాలని ప్రయత్నించొద్దు. మనకి మర్యాద కాదు అమ్మా!" అన్నాడు మహారాజు.

"మీకు అప్రతిష్ఠ కలగని విధంగానే ఎర్పాటుచేయిద్దాం. అయితే సామూహికంగా వీరులందరూ బారులుతీరి నిల్చోవటం నాకిష్టం లేదు. వరుడ్ని ఒక్కొక్కడ్నీ విడిగా ప్రశ్నలు వేస్తాను. అందుకు సరైన సమాధానాలు చెప్పినవాడిని వరిస్తాను."

కళ్యాణవర్మ కొద్ది క్షణాలేదో ఆలోచించి, "అందుకోసమైనా చుట్టుపక్కల రాజ్యాలనుంచి రాకుమారుల్ని ఆహ్వానించాలి కదా!" అన్నాడు.

"అలాగే ఆహ్వానించవచ్చును. అయితే ముందుగానే మనం ఏ పద్ధతిలో వాళ్లను




పరీక్షించ దలచుకున్నామో తెలియపరుస్తాం. అందుకిష్టపడ్డ వాళ్లే వచ్చి మనం పెట్టే పోటీలో పాల్గొంటారు".

“ఇది బాగానే ఉన్నదిగాని, ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేనివాళ్లు మనమీద కక్షపెట్టుకునే అవకాశముంది.”

‘ఈ అవకాశం స్వయంవరం చేసినప్పుడూ ఉన్నది. ఎంతోమంది

వీరులమధ్య వరించబోయేది ఒక్కడ్నే కదా! తక్కినవాళ్లు శత్రువు అయినట్టే మరి!''

కుమార్తె హేతువాదం కళ్యాణవర్మకు నచ్చింది. ఆయన అంగీకార సూచకంగా తలూపి "ఇప్పుడే అన్ని రాజ్యాలకు వర్తమానం పంపిస్తున్నాను'' అన్నాడు.

ఆ వర్తమానం విన్న రాకుమారు లందరికీ కాంచనరేఖ పెట్టిన పరీక్ష వింతగా తోచినా ఆమె అందచందాలు, రూపలావణ్యాలు తమ స్వంతమైతే బావుండునని కలలుకన్నారు. అయితే ఆమె ఎలాంటి ప్రశ్నలు వేస్తుందో వాటికి సమాధానాలు చెప్పలేకపోతే అవమానపడాల్సి వస్తుందని కొందరు భావించారు. అయితే కాంచనరేఖ తమ స్వంతం కావాలనే ప్రలోభానికి వాళ్ళు లొంగిపోయారు.

వివిధ రాజ్యాలనుంచి వచ్చిన రాకుమారు లందరికీ సకల మర్యాదలతోను అతిథి గృహాల్లో వసతి కల్పించా డు కళ్యాణవర్మ. ఎవరిమటుకు వారే తామే కళ్యాణవర్మ కాబోయే అల్లుడినని ఉవ్విళ్లూరుతున్నారు. కాంచనరేఖ ఎలాంటి ప్రశ్నలు వేస్తుందో ఎవ రికీ అంతుపట్టలేదు. ఆమె ప్రశ్నలకి ఎవరూ సరైన సమాధానాలు చెప్పలేకపోతున్నారు. విడిది గృహానిక్కూడా రాకుండా సరాసరి తమ రాజ్యాలకి పోతున్నారు. అవమాన భారం మోయలేక తక్కినవాళ్లకు ముఖాలు చూపలేక!

మందాకిని రాకుమారుడు ప్రతాపసింహుడు ఎలాగైనా కాంచనరేఖ అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి, ఆమెను పరిణయమాడాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. అతను తక్కిన రాజకుమారుల్లాగా సరాసరి కాంచనరేఖ మందిరంలోకి వెళ్లకుండా ఓ వృద్ధ బ్రాహ్మణుడి వేషంతో రాణిని కలుసుకోన టానికి వెళ్లాడు.

ప్రతాపసింహుడు వేదం చదువుతున్నాడు. కొంత జ్యోతిష శాస్త్రం కూడా అధ్యయనం చేసినవాడు. దాంతో మహారాణిగారి దర్శనం తద్వారా అంతఃపుర సందర్శనం తేలికగానే లభించాయి.

మహారాణి ప్రతాపసింహుణ్ణి సాదరంగా ఆహ్వానించి గౌరవపురస్కారంగా అగ్రాసనమిచ్చి సన్మాన చేసింది.

"స్వామి మీరు చూడగా సర్వజ్ఞుల వలె ఉన్నారు. దయచేసి మా కుమారితకు కళ్యాణ ఘడియ ఎప్పుడో సెలవివ్వండి'' అన్నది మహారాణి.

వృద్ధ బ్రాహ్మణుడి వేషంలో ఉన్న ప్రతాపసింహుడు చిరునవ్వు నవ్వి, "మహారాణీ! ప్రస్తుతం రాజకుమారి వీరుని స్వయంగా ఎన్నుకునే కార్యక్రమంలోనే ఉన్నదనుకుంటాను...'' అన్నాడు.

మహారాణి ముఖం వన్నె తగ్గింది. విచార మేఘాలు ఆమె వదనాన్ని కప్పివేశాయి.

"ఏం చెప్పమంటారు స్వామి, అమ్మాయి ఎవరూ నడవని త్రోవన నడుస్తోంది. రాచకన్య స్వయంవరంలో వరుని ఎన్నుకోవటం అనాదిగా వస్తున్న సత్సాంప్రదాయం. కాని, మా కుమారి తనని వివాహమాడ కోరిన రాకుమారులకు పరీక్ష పెడుతున్నది. ఎవరూ ఆమెకు

నచ్చటం లేదు. అవమానంతో వచ్చిన యువరాజులు తిరిగి వెళ్లిపోతున్నారు. అవమానాన్ని దహింపబడిన ఆ యువరాజులు తమ తండ్రుల చేత మాపై దండయాత్రలకు సన్నాహాలు వేయకమానరు! ఇంతకాలం అవిచ్ఛిన్నంగా సుసంపన్నంగా ఉన్న మా మద్రరాజ్యం అన్యాక్రాంతమయిపోతుందేమోనని భయంగా ఉన్నది. ఇందుకు తరుణోపాయం తమరే సూచించాలి!" అన్నదామె ప్రాధేయపూర్వకంగా.

ప్రతాపసింహుడు కాసేపు ఏదో మీనమేషాలు లెక్కించి, తర్వాత చిరునవ్వుతో మహారాణిని చూసి, "మహారాణీ! తమరు చింతించవలసిన పనిలేదు. రాజకుమారిత త్వరలోనే పెండ్లి కుమారిత కాబోతోంది" అన్నాడు.

మహారాణి పట్టరాని సంతోషంతో తన మెడలోని రత్నాలహారం ప్రతాపసింహుడికి బహూకరించింది. "ఎంత చల్లటి మాట చెప్పారు స్వామీ! మీ నోటి చలువ వల్ల మా కుమార్తె వివాహం జరిగిపోతే, మాకు ఇరుగు పొరుగు రాజ్యాలతో శత్రుత్వం తప్పటమే కాక, మా మనసులు చల్లబడతాయి" అన్నది.

"ఇప్పుడు మా కుమార్తె వివాహార్థమై వచ్చిన రాకుమారుల్లో ఒకరితో తప్పనిసరిగా మీ కుమార్తె వివాహం జరగాలి! అప్పుడే తక్కిన రాకుమారులు, వారివారి తండ్రులు శాంతిస్తారు" అన్నాడు ప్రతాపసింహుడు.

"నిజం చెప్పారు స్వామీ! దాదాపు మూడు వంతుల యువరాజులు అవమానభారంతో తిరిగి వెళ్ళిపోయారు. ఉన్నవారిలో సగానికి పైగా చెప్పాపెట్టకుండా వెళ్ళిపోయారు. అమ్మాయి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక అవమానంతో వెళ్ళేకన్నా ముందుగానే వెళ్ళిపోతే పరువు మర్యాదలు దక్కుతాయని! ఇక మిగిలిన



యువరాజుల్లో ఎవర్ని అమ్మాయి వరిస్తుందో ...యి వరిస్తుందో లేదో..."
...రాణి విరాసగా పలికింది.

నా వాక్కు వ్యర్థం కాదు మహారాణీ! ఇప్పుడున్న రాకుమారుల్లోనే ఒకర్ని ఖచ్చితంగా యువరాణిగారు వరిస్తారు!" అన్నాడు.

మహారాణి ఆనందంగా అతని వంక చూసి "అది నిజమైతే మీ గృహం నిండా కనక వర్షం కురిపిస్తాం. మిమ్మల్ని ప్రభువులవారి ఆస్థాన పండితులుగా నియమింపచేస్తాము" అన్నది.

"అట్లాగే మహారాణీ, ధన్యుణ్ణి! .... అయితే వాదొక చిన్న విన్నపం!" అన్నాడు ప్రతాపసింహుడు.

"ఏమిటో సెలవివ్వండి స్వామి!"

"నేనొక పర్యాయం యువరాణివారిని చూడాలి"

'అవశ్యం పిలవమంటారా!"

"వద్దు. నేను అంతఃపురంలోనికి వచ్చిన విషయంగాని, ఆమెను చూడగోరిన విషయం గాని ఆమెకు తెలియకూడదు."

"మరి ... స్వామి..."

"అందుకో ఉపాయం చెప్తాను. ఆమె ... కుమార్లని ప్రశ్నిస్తున్న సమయంలో నే... చాటుగా ఉండి వింటాను. ఆమె మనసులో ఆ ప్రశ్నలకు జవాబులు సరియైననేననిపించేలా నేనొక యంత్రం వేసి ఆమె కూర్చొండే స్థానంలో గుప్త పరుస్తాను. దాని ప్రభావంతో ఆమె మనసుమారి రేపు ఉదయం ముందుగా ఎవరినైతే పరీక్షిస్తుందో ఆ యువకుణ్ణే తప్పక వరిస్తుంది. ఇది ముమ్మాటికీ నిజం! అన్నాడు ప్రతాపసింహుడు.

"ఆ యంత్రం ఈరోజే వెయ్యరాదా స్వామీ" అన్నది మహారాణి. ఆమెకు కుమార్తె వివాహం ఎంత తొందరగా నిశ్చయం చేద్దామా అన్నంత ఆత్రుతగా ఉంది.

ప్రతాపసింహుడు ఆమె మాటలకు మందహాసం చేసి "మహారాణీ! ఈ యంత్రం నేను యువరాణివారికి తెలియకుండా ఆమె కూచున్న ఆసనంవద్ద గుప్తపరుస్తాను. ఈ రోజు ఆమె యువరాజుల్ని పరీక్షించే వరకు అక్కడనుంచి లేచే ప్రసక్తి లేదు కదా! ఆమెను మధ్యలో బయటకు పిలిచి యంత్రం అక్కడ అమర్చవచ్చును. కాని ఆమె ప్రశ్నించే ప్రశ్నలను బట్టి యంత్రాన్ని రూపొందించాలి. అందుకు కనీసం ఈ రోజంతా వ్యవధి కావాలి!" అన్నాడు.

మహారాణి ఓ రెండు క్షణాలు ఆలోచించి "అలాగే! మీరు చెప్పినది నిజమే! అలాగే చెయ్యండి" అన్నది.

ఆ తర్వాత ప్రతాపసింహుణ్ని యువరాణికి తెలియకుండా ఆమె వరుల్ని పరీక్షించే గది ప్రక్కనే ఆమె ప్రశ్నలు వినిపించేటంత దూరంలో ఉంచారు.

ప్రతాపసింహుడు శ్రద్ధగా యువరాణి వేసే ప్రశ్నల్ని విన్నాడు. ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే యువరాణి ప్రశ్నలు మరీ కఠినతరమైనవి కావు. సామాన్య పరిజ్ఞానంతో ఆమె ప్రశ్నలకు సమాధానాలివ్వ

వచ్చును. అయితే ప్రతాపసింహుడికి ఆమె ప్రశ్నల్లోని కిటుకు ఇట్టే అర్థమయ్యింది.

యువరాణి వేసే ప్రతి ప్రశ్నకు రెండు జవాబులుంటాయి. రెండూ సరైన జవాబులే. అయితే పరీక్షింపబడే యువకుడు చెప్పిన సమాధానం 'తప్పు' అంటుంది యువరాణి. 'ఒప్పు' అయిన సమాధానం ఏమిటో వెంటనే తనే చెప్తుంది. మూడు ప్రశ్నలు వేస్తుంది. మూడు ప్రశ్నలకీ ఆ యువకుడు చెప్పిన జవాబులు సరియైనవే అనిపిస్తుంది. కాని, అవి 'తప్పు' అని యువరాణి చెప్పిన సమాధానాలు కూడా సరైనవే అని ఎవరికైనా అర్థమవుతుంది. దాంతో ఆ వచ్చిన యువరాజు మారుమాట్లాడకుండా అవమాన భారంతో వెళ్లిపోతున్నారు.

ప్రతాపసింహుడు ఆమె అడిగే మూడు ప్రశ్నలనీ వరుసగా రాసుకున్నాడు. వాటికి సరైన సమాధానాలు రెండింటినీ కూడా రాసుకున్నాడు.

అవి ఏమంటే—

మొదటి ప్రశ్న: వీరుడికి కావలసిన దేమిటి? దానికి శౌర్యము, ధైర్యము అని రెండు సమాధానాలు.

రెండో ప్రశ్న: మనిషి జీవించటానికి కావలసినదేమిటి? దానికి సమాధానాలు గాలి, ఆహారం.

మూడో ప్రశ్న: నన్ను గెలవటానికి కావలసినదేమిటి? రెండు సమాధానాలు తెలివి, సమయస్ఫూర్తి.

ఇదే ప్రశ్నలు వచ్చిన ప్రతి యువకుణ్ణీ అడిగి అతడు చెప్పే సమాధానానికి వ్యతిరేకంగా రెండో సమాధానం చెపుతోంది.

ఉదాహరణకు మొదటి ప్రశ్నకు ఆ యువకుడు శౌర్యము సమాధానం చెబితే ఆమె అది తప్పు, ధైర్యము సరైన సమాధానం అంటుంది. మరో యువకుడు ధైర్యము అని జవాబిస్తే ఆమె అది తప్పు శౌర్యము అని సరిదిద్దుతుంది. అలాగే తక్కిన రెండు ప్రశ్నలకూ కూడా సమాధానాలు చెపుతోంది.

ప్రతాపసింహుడు నలుగురు యువకుల్ని ఆమె అవే ప్రశ్నలు వేయటం, వాళ్లు చెప్పిన సమాధావం తప్పవి, ఆమె రెండో సమాధావం చెప్పి ఆ యువకుల్ని

## వొట్టు



"తాగొచ్చారా మళ్ళీ?" పెళ్ళాం నిలేసి అడిగింది.

"నీమీదొట్టు"

"నిజమేనా?"

"అబద్ధాలాడనని ప్రమాణం చేయలేదూ? అది సరే. యింటాయినొస్తే నే లేనని చెప్పు".

"అబద్ధాలాడనని నిన్నేగా చెప్పారు"

"అందుకేగా నిన్నుపోయి చెప్పమంటోంది"

జె. రాధాకృష్ణ (పామర్రు)

నిరుత్సాహపరచటం గమనించాడు. అతనికి కాంచనరేఖ మనస్తత్వం పూర్తిగా అర్థమయ్యింది. ఆమె చిలిపితనానికి తనలో తనే నవ్వుకున్నాడు. ఆమె చెప్పిన సమాధానం ఆ యువకుడు చెప్పే సమాధానం రెండు సరైనవే! రెండూ తనే ముందు చెప్పేస్తే ఆమె మరో జవాబును అప్పటికప్పుడు ఊహించి చెప్తుంది. కాబట్టి, ఆమెనోటి తోనే తను చెప్పిన సమాధానాలు అంగీకరించేలా చెయ్యాలి!

ప్రతాపసింహుడు ఓ కాగితం మీద ఆమె అడిగే ప్రశ్నలకి సమాధానం శౌర్యము, ఆహారం, సమయస్ఫూర్తి అని రాసి దాన్ని మడతలు పెట్టి ఓ రాగి చుట్టలో దాన్ని పదిలపరిచాడు. యువరాణి ఆనాటికి యువకుల్ని పరీక్షించటం పూర్తిచేసి విశ్రాంతి మందిరంలోకి వెళ్లిపోయాక, మహారాణితో చెప్పి యువరాణి కూర్చున్న ఆసనం మీదున్న మెత్తటి దిండు కింద పదిలపరచమని చెప్పాడు. మహారాణి తు.చ.తప్పకుండా అలాగే చెప్పింది.

మర్నాడు ఉదయం కేవలం పదిమంది యువరాజులు మాత్రం అతిథిమందిరంలో మిగిలారు. వాళ్లు ఎలాగైనా యువరాణి ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆమెను భార్యగా పొందాలని తహతహలాడుతున్నవాళ్లే. అయితే నువ్వు ముందు వెళ్లంటే నువ్వు ముందువెళ్లంటూ ఎవరికి వారే ముందు పరీక్షంప బడటానికి తర్జన భర్జనలు పడుతుండగా ప్రతాపసింహుడు తాను ముందుగా వెళ్తానని బయల్దేరాడు.

అతన్ని అంతఃపురానికి చేర్చారు. తెర వెనుక యువరాణి కాంచనరేఖ కూర్చుని ఉంది. ఆమెగారితో మాత్రమే పరీక్షింపబడే యువకుడికి వినిపిస్తుంది. ఆమె ఆకారం కనిపించదు. కాని యువరాణికి మాత్రం పరక్షింపబడే యువకుడు కనిపిస్తాడు. అతని మాట వినిపిస్తుంది. ఆ ఏర్పాటు కావాలన్నే కాంచనరేఖ ముందుగా ఏర్పాటు చేసుకున్నది!

ప్రతాపసింహుడు క్రితం రోజు మహారాణితో ముందుగానే చెప్పి ఉంచటంవల్ల, యువరాణికి తెలియకుండా మహారాజు, మహారాణి,మంత్రులు పక్కగదిలో రహస్యంగా ఉండి ప్రశ్నోత్తరాలు వినటానికి సిద్ధంగా ఉన్నారు.

యువరాణి మొదటి ప్రశ్న వేసింది. అందుకు ప్రతాపసింహుడు 'ధైర్యము' అని సమాధాన మిచ్చాడు. యువరాణి వెంటనే 'తప్పు, తప్పు' వీరుడికి కావలసింది శౌర్యము అన్నది.

ప్రతాపసింహుడు మందహాసం చేశాడు.

యువరాణి రెండో ప్రశ్న అడిగింది. దానికి ప్రతాపసింహుడు "గాలి" అని సమాధానమిచ్చాడు. యువరాణి రెట్టించి ఉత్సాహంతో "కాదు, ఆహారం" అన్నది.

ప్రతాపసింహుడు తలవూపాడు.

యువరాణి మూడో ప్రశ్నకు ప్రతాపసింహుడు "తెలివి" అని సమాధానమిచ్చాడు. ఆమె నవ్వి, "కాదు కాదు — సమయస్ఫూర్తి!" అన్నది. అని "మీరు ఓడిపోయారు ఇక వెళ్లొచ్చు" అన్నది.

ప్రతాపసింహుడి వదనంలో చిరునవ్వు! చెక్కుచెదరలేదు. "యువరాణి!మీరు

చెప్పిన సమాధానాలు నేనే చెప్పినుంటే నన్ను తప్పక వివాహం చేసుకుని ఉండేవారా" అనడిగాడు.

"అవశ్యం!" అన్నది యువరాణి.

"అయితే నేనే గెలిచాను. మీరు కూచున్న సింహాసనం మీద దిండు క్రింద పరీక్షించండి. తాయెత్తువంటి రాగి చుట్ట కనిపిస్తుంది. అందులో మీరు చెప్పిన సమాధానాలు నేను ముందుగానే రాసి పెట్టాను!" అన్నాడు ప్రతాపసింహుడు.


యువరాణి ఉలిక్కిపడింది. ఆమెతోబాటు రహస్యంగా కూచుని వింటున్న మహారాజు, రాణి, మంత్రులు త్రుళ్లిపడ్డారు. పొంచి చూశారు. యువరాణి చటుక్కున తన ఆసనం మీద దిండును తొలగించి చూసింది. రాగిచుట్ట కనిపించింది. దాన్ని విప్పింది. ప్రతాపసింహుడు క్రితం రోజు రాసి పెట్టిన సమాధానాలు చదివి, "మోసం! మోసం!" అన్నది.

మహారాజు, రాణి బయటకు వచ్చి ఆ కాగితం అందుకుని చూశారు. అందులో తమ కుమార్తె చెప్పిన సమాధానాలే ఉన్నాయి.

ప్రతాపసింహుడు యువరాణి వంక చూసి "యువరాణీ! నేను చేసింది మోసం కాదు. సమయస్ఫూర్తితో మీ ఎత్తుకు పైఎత్తు వేశాను. మీ చిలిపితనానికి సరైన గుణపాఠం చెప్పాను. లోకంలో మీరొక్కరే తెలివైన వారు కాదని నిరూపించటానికే ఇలా చేశాను. నేను గెలిచాను. న్యాయంగా మీరు నన్ను వివాహం చేసుకోవలసి ఉంది. కాని నేను బలవంతాన మిమ్మల్ని పెళ్లాడను. మీరు నన్ను మనస్ఫూర్తిగా అంగీకరిస్తేనే ఈ వివాహం జరుగుతుంది" అన్నాడు.

యువరాణి ప్రతాపసింహుడి వంక ప్రేమగా, ఆరాధనగా చూసి సిగ్గుతో తలవంచుకున్నది.

ప్రతాపసింహుడు ఆమె వంక నవ్వుతూ చూసి "మీ ప్రశ్నలకు ఈ రెండు సమాధానాలు కూడా సరైనవే! ఆ మాటకొస్తే రెండూ ఉండాల్సినవే!" అన్నాడు.



## అద్భుత వృక్షం

టాంజానియా శాస్త్రవేత్తలు ఓ మొక్క ఎరువుగానూ, క్రిమిసంహారకం గానూ పనిచేస్తుందని అంటున్నారు. మార్జియా అనే ఈ మొక్క ప్రతి హెక్టారు పొలంలోనూ 300 కిలోల నైట్రోజన్‌ను ఉత్పత్తి చెయ్యడంలో తోడ్పడడమే గాక, క్రిమిసంహారకంగా కూడా పనిచేస్తుంది. అంతేకాదు! మార్జియా గింజల్ని ధాన్యంతో కలిపినపుడు చాలాకాలం పురుగుపట్టకుండా ధాన్యం నిల్వ ఉండడంకూడా విశేషమే! రసాయనాల కాలుష్యంతో బాధపడుతున్న రైతులకు నిజంగా ఈ 'మార్జియా' అద్భుత వృక్షం అనడంలో ఏమాత్రం సందేహంలేదు.

జూపిటర్